# సాక్షి సూర్యాపేట

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024






**కలుషిత ఆహారం తిని..**

కలుషిత ఆహారం తిని 25మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన భువనగిరిలో చోటుచేసుకుంది. - 8లో



**మద్యం దుకాణం దగ్ధం**

శాలిగౌరారం మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో వైన్స్‌షాపు దగ్ధమైంది. - 8లో

**హెల్త్ చెకప్‌కు వెళ్తూ..**



ఆస్పత్రిలో హెల్త్ చెకప్ కోసం వెళ్తుండగా ఆగిఉన్న లారీని క్యాబ్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. - 8లో

## న్యూస్‌రీల్

### కాంగ్రెస్ సమావేశాల్లో స్వల్ప మార్పులు

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్ : నల్లగొండ లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సన్నాహక సమావేశాల్లో స్వల్ప మార్పులు చేసినట్లు ఆ పార్టీ నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న మిర్యాలగూడలో సాయంత్రం 4 గంటలకు, 18న కోదాడలో సాయంత్రం 5 గంటలకు, 19న సూర్యాపేటలో సాయంత్రం 4 గంటలకు, 21న హుజూర్‌నగర్‌లో సాయంత్రం 5 గంటలకు, 22న నాగార్జునసాగర్‌లో సాయంత్రం 4 గంటలకు నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 24న నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించి.. అనంతరం ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డితో వ్యక్తిగత పరిచయం, చర్చా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశాలకు జిల్లా మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని మంత్రి ఉత్తమ్ కోరారు.

### ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వద్దు

సూర్యాపేట: ధాన్యం కొనుగోళ్ల విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటరావు హెచ్చరించారు. శనివారం సూర్యాపేట మండలం ఇమాంపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతులను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 295 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు తెచ్చిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ధాన్యం కేంద్రాల్లో సమస్య వస్తే కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. సీజన్ ముగిసే వరకు ఎలాంటి సమస్యలు రాకుండా ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా కేంద్రాల నిర్వాహకులు బాధ్యతాయుతంగా రైతులకు సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్.లత, డీఎస్‌ఓ మోహన్‌బాబు, తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, మార్కెటింగ్ డీఎం శర్మ తదితరులు పాల్గొన్నారు.

### మట్టపల్లిలో నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలు కొనసాగాయి. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో స్వామివారి నిత్య కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించిన అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదనచేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

### డిగ్రీ గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నాగార్జునసాగర్: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ డిగ్రీ గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు సాగర్ మహాత్మా జ్యోతిబాపూలే బీసీ డిగ్రీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.రవీంద్రాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరం డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన వారంతా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 28వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

# అమ్మేందుకూ అవస్థలు

- ఒక్కరోజే 47,660 బస్తాల ధాన్యం రాక
- నిర్ణీత సమయానికి లోపలికి అనుమతించని అధికారులు
- రోడ్డుపై బారులుదీరిన వందలాది ట్రాక్టర్లు
- కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ జామ్

**తిరుమలగిరి మార్కెట్‌కు వెల్లువలా ధాన్యం**



తిరుమలగిరి మార్కెట్ ఎదుట రోడ్డుపై శుక్రవారం అర్ధరాత్రి బారులుదీరిన ధాన్యం ట్రాక్టర్లు

తిరుమలగిరి (తుంగతుర్తి): ఆరుగాలం కష్టించి వరి ధాన్యం పండించిన రైతులకు దాన్ని అమ్ముకునేందుకు కూడా అవస్థలు తప్పడం లేదు. శనివారం తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ పరిస్థితి నెలకొంది. మార్కెట్‌కు ఈ యాసంగి సీజన్‌లోనే శనివారం ఒక్క రోజే అత్యధికంగా 47,660 బస్తాల ధాన్యం వచ్చింది. రంజాన్ పండుగ సందర్భంగా మార్కెట్‌కు గురువారం, శుక్రవారం సెలవులు ప్రకటించారు. శనివారం మార్కెట్ తెరవనుండంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రైతులు శుక్రవారం అర్ధరాత్రి నుంచే ధాన్యం ట్రాక్టర్లతో వచ్చి మార్కెట్ యార్డు ముందున్న సూర్యాపేట–జనగామ ప్రధాన రహదారిపై నిలిపారు.

**సకాలంలో గేటు తీయకపోవడంతో**

వ్యవసాయ మార్కెట్ యార్డుకు లోపలికి అర్ధరాత్రి 12గంటల నుంచే ధాన్యాన్ని అనుమతించాలి కానీ, మార్కెట్ అధికారులు మాత్రం చాలా ఆలస్యంగా శనివారం తెల్లవారుజామున 5 గంటలకు గేటు తీశారు. దీంతో అప్పటి వరకు వచ్చిన వందలాది ధాన్యం ట్రాక్టర్లతో సూర్యాపేట–జనగాం రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వందలాది ట్రాక్టర్లు సూర్యాపేట, జనగామ, తొర్రూరు, మోత్కూరు రోడ్లపై కిలోమీటర్ల పొడవునా నిలిచి ఉండడంతో 5 గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ గేట్లు ముందుగానే తీయాలని మార్కెట్ అధికారులపై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు

**రెండు రోజులు మార్కెట్‌కు సెలవు**

వ్యవసాయ మార్కెట్‌కు శనివారం భారీగా ధాన్యం రావడంతో కాంటాలు ఆలస్యం అవుతున్నాయి. దీంతో ఆదివారం, సోమవారం సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. తిరిగి మార్కెట్‌ను మంగళవారం తెరవనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఉదయం 4 గంటలకే గేటు తెరుస్తామని తెలిపారు.

### పేట మార్కెట్‌కు కొనసాగుతున్న ధాన్యం రాక

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు ధాన్యం వెల్లువలా వస్తోంది. శనివారం 649 మంది రైతులు 30,294 బస్తాల ధాన్యాన్ని యార్డుకు తీసుకొచ్చారు. ఇందులో జైశ్రీరామ్ రకం ధాన్యం అత్యధికంగా 18,800 బస్తాలు వచ్చింది. వీటికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,556, కనిష్ఠ ధర రూ.1,501 చొప్పున ధర పలికింది. ఇక బీపీటీ పాతవి 106 బస్తాలు, ఐఆర్–64 రకం 6,127 బస్తాలు, హెచ్ఎంటీ రకం 5,186 బస్తాలు, ఆర్ఎన్ఆర్ రకం 60 బస్తాలు, ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం (పాతవి) 15 బస్తాల చొప్పున మార్కెట్ యార్డుకు అమ్మకానికి వచ్చాయి.



సూర్యాపేట మార్కెట్‌లో వడ్ల రాశులు

### ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి



తిరుమలగిరి మార్కెట్‌లో ధాన్యంలో తేమ శాతం చూస్తున్న అదనపు కలెక్టర్ లత

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ లత మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కోసిన వెంటనే ధాన్యాన్ని తీసుకురావద్దని, 17 శాతం లోపు తేమ వచ్చేలా ధాన్యాన్ని ఆరబెట్టుకొని మార్కెట్‌కు తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు. మార్కెట్‌లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని కొనుగోళ్లు వేగవంతంగా చేయాలన్నారు. ఆమె వెంట జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ, సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, తహసీల్దార్ సుధ, మార్కెట్ కార్యదర్శి శ్రీధర్, సిబ్బంది అల్తాఫ్, కమిషన్‌దారులు సంకెపల్లి నర్సింహారెడ్డి, రాపాక సోమేష్, ఆంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గీత దాటితే వేటే..

**లోక్‌సభ ఎన్నికల వేళ ప్రభుత్వ ఉద్యోగులపై నిఘా**

- అధికారులు, సిబ్బంది కదలికలపై కేంద్ర ఎన్నికల సంఘం నజర్
- ప్రచారంలో పాల్గొంటున్న వారిపై చర్యలకు సిద్ధం
- అప్రమత్తమైన జిల్లా అధికారులు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై కేంద్ర ఎన్నికల సంఘం కొరడా ఝులిపిస్తోంది. ఇటీవల సిద్దిపేట జిల్లాలో ఓ పార్టీ అభ్యర్థి నిర్వహించిన సమావేశానికి వెళ్లిన 106 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై ఎన్నికల అధికారి సస్పెన్షన్ వేటు వేశారు. ఇతర పార్టీలు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన నిఘా విభాగం అధికారులు ఆ వేడుక మందిరంలో నుంచి బయటకు వచ్చిన ఒక్కొక్కరిని గుర్తిస్తూ వారి వివరాల్ని, హోదాల్ని సేకరించి విధులకు దూరంగా ఉండాలని ఉత్తర్వులు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల వేళ ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. దీంతో రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాలో సర్వేలెన్స్ బృందాలు ఉద్యోగులపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. జిల్లాలో పూర్తిస్థాయి, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పోలీస్ ఉద్యోగులు మొత్తం 13 వేల మంది వరకు ఉంటారు. వీరు ఏ పార్టీకి మద్దతుగా నిలిచినా ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తప్పవనే తెలుస్తోంది.

**గతంలోనూ తప్పని చర్యలు..**

గడిచిన దశాబ్ద కాలంలో జిల్లాలో కొందరు అధికారులు, సిబ్బందిపై అందిన ఫిర్యాదులతో ఉన్నతాధికారులు, ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలతో పలువురిపై వేటు పడింది. 2019 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఒక పార్టీ ర్యాలీలో పాల్గొన్న ఇద్దరు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల సమయంలో అభ్యర్థులకు వత్తాసు పలికారనే ఆరోపణలతోనూ జిల్లాలో కొందరు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు.

**జాగ్రత్తగా ఉండాల్సిందే..**

ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు ప్రచారం చేయరాదనే నిబంధనలు 1910 సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయి. సెక్షన్ 23 (ఐ) ప్రకారం వారంతా ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు వివిధ కార్పొరేషన్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే అన్ని స్థాయిలు, కేటగిరీల ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ పారదర్శకంగా వ్యవహరించాలి. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి అధికారి, ఉద్యోగి తన వంతు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలి. ఎలాంటి పక్షపాతాన్ని చూపించకూడదు. ప్రభుత్వం అందించిన ఉద్యోగ బాధ్యతతో అందరి మన్ననల్ని పొందే విధంగా పని తీరులో ప్రత్యేకతను చూపిస్తూ.. ఒక పార్టీకి మద్దతుగా నిలవకుండా విధులు నిర్వహించాల్సి ఉంది.

**ఇలా చేయడం తప్పు..**

- సామాజిక మాధ్యమాల్లో పోస్టులను చూసి ఒక పార్టీకి అనుకూలంగా ప్రభుత్వ ఉద్యోగి కామెంట్ పెట్టినా చర్యలుంటాయి.
- ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఒక అభ్యర్థికి సహకరిస్తున్నారనే చిన్నపాటి ఆధారాలు దొరికినా వేటు పడుతుంది.
- ముఖ్యంగా ప్రచార సభల్లో పాల్గొనడం, లోలోపల తమ కులం నేత అని ప్రచారం చేయడాన్ని కూడా ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణిస్తోంది.
- ఉద్యోగుల సొంత ఊళ్లలోనూ పార్టీల కండువాలు వేసుకుని ప్రచారం చేయడం లేదా.. రెచ్చగొట్టే విధంగా మాట్లాడటంలాంటివి చేయొద్దు.
- తన కింది స్థాయి సిబ్బందికి అధికార దర్పంతో ఒక పార్టీకి సహకరించాలని, ఫలానా వాళ్లకు ఓటెయ్యాలని చెప్పకూడదు.

### ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షిద్దాం



సూర్యాపేటలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న రాములు

సూర్యాపేట టౌన్: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులంతా కృషిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు పిలుపునిచ్చారు. సంఘం 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం సూర్యాపేటలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఉద్యమ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో సంఘం పెద్దన్న పాత్ర పోషిస్తోందన్నారు. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ విధానం అమలుకు సంఘం ఎనలేని కృషిచేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు జె.యాకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కె.అరుణభారతి, జిల్లా కోశాధికారి జి.వెంకటయ్య, జిల్లా కార్యదర్శులు బి.పాపిరెడ్డి, బి.ఆడమ్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.అనిల్‌కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ డి.శ్రీనివాసాచారి, బి.ఆనంద్, ఏ.సీనయ్య, బి.శేషాచారి, జి.నర్సయ్య, ఎస్.అంజయ్య, ఆంజనేయులు, రాఘవులు పాల్గొన్నారు.

### ఆదర్శప్రాయుడు జార్జిరెడ్డి

సూర్యాపేట టౌన్: ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా విద్యార్థి సమస్యలపై, మూకదాడులపై తిరుగుబాటు చేసిన జార్జిరెడ్డి నేటి విద్యార్థులు, యువకులకు ఆదర్శప్రాయుడని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. శనివారం జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేటలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి, నిరుద్యోగ, యువతను నిర్లక్ష్యం చేసిన బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. ఈ సదస్సులో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, వెంకటేష్, యాసిన్, సుహాస్, రాజు, సుష్మ, లక్ష్మి, రమణ, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నామాల ఆజాద్

# TG కార్డులొచ్చాయ్!

- తెలంగాణ స్టేట్ (టీఎస్)ను తెలంగాణ (టీజీ)గా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- అందుకు అనుగుణంగా కార్డులు మార్చిన రవాణా శాఖ
- వాహనదారులకు కార్డుల జారీ
- ఉమ్మడి జిల్లాలో 1500 చొప్పున ఆర్సీ, డీఎల్ కొత్త కార్డుల పంపిణీ




సాక్షి ప్రతినిధి, నల్లగొండ : తెలంగాణ (టీజీ) పేరుతో రూపొందించిన కొత్త డ్రైవింగ్ లైసెన్స్‌లు (డీఎల్), రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) కార్డులు వచ్చేశాయి. రవాణా శాఖ వాటిని వాహనదారులకు జారీ చేయడాన్ని ప్రారంభించింది. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత తెలంగాణ స్టేట్ (టీఎస్) పేరుతోనే ఇన్నాళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్‌సీలు, డీఎల్‌లను జారీ చేసింది. తెలంగాణ ఉద్యమ సమయంలో కొందరు యువకులు టీజీ పేరును వాహనాలపై రాసుకున్నారని, ఉద్యమంలో దానిని అందరూ అనుసరించారని, కాబట్టి టీఎస్ అవసరం లేదని, టీజీగా మారుస్తామని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా గత నెలలో టీఎస్‌ను టీజీగా మార్పు చేసింది. జాతీయ స్థాయిలో చెల్లుబాటు అయ్యేలా డీఎల్, ఆర్‌సీలకు కేంద్రం ఆమోదం తీసుకొని గెజిట్ నోటిఫికేషన్‌ను జారీచేసింది. ఈ మేరకు మార్పులు చేసిన కొత్త కార్డులను రవాణా శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వాటి జారీ ప్రక్రియను ఇటీవల ప్రారంభించింది.

**కార్డులపై ఇదీ మార్పు..**

ఇన్నాళ్లు ఆర్‌సీ, డీఎల్ కార్డులపై ఇండియన్ యూనియన్ డ్రైవింగ్ లైసెన్స్ ఇష్యూడ్ బై తెలంగాణ స్టేట్ అని ఉండటంతో పాటు కార్డుపై ఒకపక్కన సర్కిల్‌లో టీఎస్ అని ఉండేది. ఇప్పుడు దానిని మార్చి ఇండియన్ యూనియన్ డ్రైవింగ్ లైసెన్స్ ఇష్యూడ్ బై తెలంగాణ అని ముద్రించింది. అలాగే ఒక పక్కన సర్కిల్‌లో గతంలో టీఎస్ అని ఉండగా ఇప్పుడు దానిని టీజీగా మార్చింది. అలాగే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కార్డుపైనా ఇన్నాళ్లు ఇండియన్ యూనియన్ వెహికిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇష్యూడ్ బై తెలంగాణ స్టేట్ అని ఉండగా, ఇప్పుడు దానిని ఇండియన్ యూనియన్ వెహికిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇష్యూడ్ బై తెలంగాణగా మార్చింది. అలాగే కార్డుపై ఒక పక్కన సర్కిల్‌లో టీఎస్‌కు బదులు టీజీని ముద్రించింది.

**వేగంగా కొత్త కార్డుల ముద్రణ..**

కొత్త కార్డులను వేగంగా ముద్రించేలా రవాణా శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్ర రవాణా శాఖ నుంచి జిల్లా కార్యాలయాలకు వచ్చిన కార్డులపై వాహనాలు, వాహనదారులకు సంబంధించిన వివరాలను, డ్రైవింగ్ లైసెన్స్‌పై దానిని పొందిన వారి వివరాలను ముద్రించే కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు మొదటి విడతలో 1500 ఆర్‌సీ కార్డులను రాష్ట్ర కార్యాలయం కేటాయించగా, వాటిని ముద్రించి జారీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పుడు మరో 3,500 వేల కార్డులను ఉమ్మడి జిల్లాకు కేటాయించగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాలు వాటి ముద్రణ కార్యక్రమాన్ని చేపట్టాయి. అలాగే నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రికి కలిపి దాదాపు 4500కు పైగా డ్రైవింగ్ లైసెన్స్ కార్డులను కేటాయించగా, అందులో 1500వరకు ముద్రించి వాటి జారీని ప్రారంభించింది. మరో 3 వేల కార్డుల ముద్రణ కార్యక్రమాన్ని చేపట్టింది. త్వరలోనే వాటిని కూడా వాహనదారులకు జారీచేయనుంది.

### యాదాద్రిలో పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం చేపట్టారు. అనంతరం ఆరాధన నిర్వహించి, స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన వంటి పూజలు నిర్వహించారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ముఖ మండపంలో అష్టోత్తర పూజలు జరిపించారు.

### ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

- డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు

మద్దిరాల: పని ప్రదేశాలలో ఉపాధిహామీ కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్ననెమిల గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. జాబ్ కార్డులేని వారికి కొత్త జాబ్ కార్డు అందజేసి వారికి పనులు కల్పించాలని ఆదేశించారు. ఎండల దృష్ట్యా పని ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ సత్యనారాయణ, ఏపీఓ గుండు వెంకన్న, ఏపీఎం మైసయ్య, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.




చిన్ననెమిల గ్రామంలో చెరువు పూడికతీత పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

# మరో రెండు రోజులే గడువు

**15 వరకు ఓటరు నమోదుకు చాన్స్**

- ఇప్పుడు నమోదైతే లోక్‌సభ ఎన్నికల్లో ఓటేయవచ్చు
- జిల్లాలో ప్రస్తుత ఓటర్లు 9,96,493 మంది



దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఓటరు నమోదుకు ఇక, రెండు రోజులు గడువు ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయాలంటే ఓటు జాబితాలో పేరుండాలి. అయితే 18 ఏళ్లు నిండినా ఇంకా ఓటు హక్కు పొందని వారు వెంటనే నమోదు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం సూచిస్తోంది. గ అసెంబ్లీ ఎన్నికల్లో అర్హత ఉన్నా ఓటు రాదని చాలా మంది ఆందోళనకు గురయ్యారు. ఈ పరిస్థితి రాకుండా ముందస్తుగా తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు, స్థానికంగా ఉండే బీఎల్‌ఓల వద్ద జాబితా చూసుకొని అందులో పేరులేకుంటే ఓటరు నమోదు చేసుకోవచ్చు.

**ఫారం–6 నింపి ఇవ్వాలి**

జిల్లాలో లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ ఈనెల 18న విడుదల చేయనున్నారు. మే 13న పోలింగ్ నిర్వహిస్తారు. ఓటరు జాబితాలో పేరు లేనివారితోపాటు 18 ఏళ్లు నిండిన వారంతా తమ పేరు నమోదు చేసుకోవాలి. ఈ నెల 15 నాటికి ఓటు నమోదుకు చివరి అవకాశం ఉంది. అయితే ఇందుకు ఫారం–6లో పూర్తి వివరాలు నింపి, కావాల్సిన పత్రాలు జతచేసి తహసీల్దార్ కార్యాలయాలు, బీఎల్‌ఓలకు అందజేస్తే సరిపోతుంది. ఆన్‌లైన్‌లో https://voters.eci.gov.in వెబ్‌సైట్లో పేరుందో లేదో చూసుకోవడంతో పాటు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవచ్చు. ఇప్పటికే జాబితాలో పేరుండి ఇల్లు మారి ఉంటే.. ఇప్పుడు ఉంటున్న ప్రాంతానికి మార్చుకోవడంతో పాటు దగ్గరలోని పోలింగ్ కేంద్రానికి మారే అవకాశం ఉంది. ఇందుకు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు జాబితాలో పేరు తొలగించుకునేందుకు ఫారం–7 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

**పరిశీలన పూర్తికాగానే అనుబంధ జాబితా**

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జాబితాను అధికారులు ఫిబ్రవరి 8న ప్రకటించారు. అర్హులైన వారికి మరో అవకాశం ఇచ్చేందుకు ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఓటరు అనుబంధ జాబితా ఈ నెల 25న అధికారులు ప్రకటిస్తారు.

**నియోజకవర్గాల వారీగా ఓటర్లు ఇలా..**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 9,96,493 మంది ఓటర్లు ఉన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో 2,43,090 మంది ఓటర్లు, కోదాడ నియోజకవర్గంలో 2,44,547 మంది ఓటర్లు, తుంగతుర్తిలో 2,55,348 మంది, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,58,508 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

## క్లుప్తంగా

### హెల్త్ చెకప్‌కు వెళ్తూ.. అనంత లోకాలకు

- ఆగిఉన్న లారీని ఢీకొన్న క్యాబ్
- ఇద్దరి మృతి, మరో ఇద్దరికి గాయాలు
- మృతులు చిలుకూరు మండలం బేతవోలు వాసులు


వీరయ్య (ఫైల్)


మొగ్గయ్య (ఫైల్)


లారీ కిందికి దూసుకెళ్లిన కారు

నాగోలు: ఆస్పత్రిలో హెల్త్ చెకప్ కోసం వెళ్తుండగా ఆగిఉన్న లారీని క్యాబ్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఎల్‌బీనగర్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన సాదె వీరయ్య (78), ఇదే గ్రామానికి చెందిన సుంకరి మొగ్గయ్య (60) నగర శివారు హయత్‌నగర్ సూర్యనగర్ కాలనీలో నివాసం ఉండే సాదె జగదీష్ వద్దకు శుక్రవారం వచ్చారు. శనివారం ఉదయం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో సాదె వీరయ్య హెల్త్ చెకప్‌నకు వెళ్లేందుకు ఓలా క్యాబ్‌ను బుక్ చేసుకున్నారు. కారులో డ్రైవర్‌తో పాటు వీరయ్య, మొగ్గయ్య, జగదీష్‌లు కలిసి హయత్‌నగర్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తున్నారు. ఎల్‌బీనగర్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద రోడ్డు మధ్యలో నిలిపి ఉన్న లారీని వెనక నుంచి క్యాబ్ ఢీకొంది. కారులో ఉన్న నలుగురిలో మొగ్గయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వీరయ్యను ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్ తరలించారు. తలకు తీవ్రగాయాలైన జగదీష్, కారు డ్రైవర్ కిరణ్‌కుమార్‌లను కొత్తపేటలోని ఓమ్ని హాస్పిటల్‌కు తీసకెళ్లారు. కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరయ్య మృతి చెందాడు. లారీ డ్రైవర్‌ను ఎల్‌బీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. కేసు దర్యాప్తులో ఉంది. మృతుల స్వగ్రామం బేతవోలులో విషాదం అలుముకుంది.

### గంజాయి పట్టివేత

సూర్యాపేట: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. శనివారం సూర్యాపేట పట్టణ జేజే నగర్, తాళ్ల గడ్డకు చెందిన చరణ్, నాగరాజు హైటెక్ బస్టాండ్ సమీపంలో ఉదయం అదుపులోకి తీసుకొని 150గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. గంజాయి తరలించినా, అమ్మిన వారిపైకఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నాడు మోడువారి.. నేడు చిగురించి


ఇరవై రోజుల క్రితం ఆకులు రాలిన చెట్లు


ప్రస్తుతం చిగురించి పచ్చదనాన్ని సంతరించుకున్న చెట్లు

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఇరవై రోజుల క్రితం మోడుగా మారిన చెట్లు ప్రస్తుతం చిగురుటాకులు తొడిగి పచ్చదనంతో కళకళలాడుతూ ఇలా కనిపిస్తోంది. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

మఠంపల్లి: రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతిచెందగా బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రఘునాథపాలెం గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. చింతలపాలెం మండలం చిత్రియాలకు చెందిన చెడపంగు కృష్ణయ్య తన కుమారుడు 4వతరగతి చదువుతున్న పవన్‌కుమార్‌కు కుక్కకాటుకు మందు వేయించేందుకు బైక్‌పై మఠంపల్లికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో రఘునాదపాలెం వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ రోడ్డుపై పడిపోగా నడుపుతున్న కృష్ణయ్య రోడ్డుకు ఎడమ పక్కన కిందపడిపోయి స్వల్ప గాయాలయ్యాయి. అయితే వెనుక కూర్చున్న బాలుడు పవన్ ఎగిరిపడి కుడి వైపున రోడ్డుపై పడిపోవడంతో వేగంగా వస్తున్న టిప్పర్ బాలుడిపై నుంచి వెళ్లింది.దీంతో బాలుడి నడుముకి,తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.స్థానికుల సమాచారంతో మఠంపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.


ప్రమాదానికి కారణమైన టిప్పర్

## యువకుడు అదృశ్యం

త్రిపురారం : అత్తగారింటికి వచ్చిన యువకుడు కుటుంబ కలహాల కారణంగా అదృశ్యమయ్యాడు. ఈ ఘటన త్రిపురారం మండలంలోని బడాయిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో చేటుచేసుకుంది. శనివారం ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని పుట్టల గడ్డకు చెందిన రమావత్ రంగా(26)కు త్రిపురారం మండలంలోని బడాయిగడ్డ గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. గత మార్చి 29వ తేదీన రంగా బడాయి గడ్డలోని అత్తగారింటికి వచ్చాడు. అక్కడ కుటుంబలో కలహాలు తలెత్తడంతో రమావత్ రంగా తన తల్లికి ఫోన్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో బంధువుల ఇల్లు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి రమావత్ కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రమావత్ రంగా (ఫైల్)

## షార్ట్‌సర్క్యూట్‌తో మద్యం దుకాణం దగ్ధం

శాలిగౌరారం: షార్ట్‌సర్క్యూట్‌తో వైన్స్‌షాపు దగ్ధమైంది. ఈ ఘటన శాలిగౌరారం మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. అందుకు సంబంధించి ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలో గురుజాల రోడ్డువెంట ఉన్న శ్రీదేవి వైన్స్ నిర్వాహకులు శుక్రవారం రాత్రి 10 గంటలకు మూసివేసి ఇంటికి వెళ్లిపోయారు. అర్ధరాత్రి సమయంలో షాపులోపల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరుగడంతో మంటలు చెలరేగాయి. వైన్స్‌షాపులో నుంచి పొగలు రావడంతో ఓ జ్యూవలరీ షాపు నిర్వాహకుడు గమనించి వెంటనే యజమానికి విషయాన్ని తెలిపాడు. దీంతో అతను చుట్టుపక్కలవారికి చెప్పడంతో వారు వైన్స్‌షాపు నిర్వాహకులకు, అగ్నిమాపక కేంద్రానికి ఫోన్‌లో సమాచారం అందించారు. వైన్స్ నిర్వాహకులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో షాపును తెరిచి మంటలను ఆర్పివేశారు. ఈలోగా నకిరేకల్ నుంచి ఫైరింజన్‌తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిస్థాయిలో ఆర్పివేశారు. ఈ మంటల్లో షాపులోని కౌంటర్‌తో పాటూ కౌంటర్‌లో ఉన్న రూ.50 వేల నగదు, క్యాష్ కౌంటిగ్ మిషన్, 8సీసీ కెమరాలు, సిస్టం, ఇన్‌వర్టర్, బ్యాటరీ, రెండు స్వైపింగ్ మిషన్లు, స్కానర్లతో పాటూ 71 కాటన్ల మద్యం, 15 కాటన్ల బీర్లు, మూడు ఫ్రిజ్‌లు మంటల్లో కాలిపోయాయి. ప్రమాద స్థలాన్ని శనివారం స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్‌తో పాటు ఎక్సైజ్ ఎస్‌ఐ షేక్ చాంద్‌బిలు సిబ్బందితో వచ్చి పరిశీలించారు. వైన్స్ నిర్వాహకుడు బట్ట సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.


దగ్ధమైన వైన్స్‌షాపును పరిశీలిస్తున్న పోలీస్, ఎక్సైజ్ ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, షేక్ చాంద్‌బి

## తాళం వేసిన ఇంట్లో చోరీ

నడిగూడెం : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన నడిగూడెం మండలం రామాపురంలో శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన మోతె సైదులు తన కుటుంబంతో ఇటీవల మిరపకాయలు తెంచడానికి వలస వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చి చూడగా వస్తువులన్నీ చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. బియ్యం డబ్బాలో ఉన్న నల్లపూసల గొలుసు, అర తులం చెవుల దిద్దులు, 10 తులాల వెండి చోరీకి గురైనట్లు బాధితుడు సైదులు తెలిపాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.


సైదులు ఇంట్లో చిందరవందరగా చేసిన బియ్యం

## 50 పార్లమెంట్ స్థానాల్లో సీపీఎం పోటీ

చౌటుప్పల్: దేశ వ్యాప్తంగా 50 పార్లమెంట్ స్థానాల్లో సీపీఎం పోటీ చేస్తుందని, మిగిలిన స్థానాల్లో ఇండియా కూటమికి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి నుంచి తమ పార్టీ పోటీలో ఉందన్నారు. అవకాశవాదులు, అవినీతిపరులు, అవసరానికి పార్టీలు మారే వ్యక్తులు ఉన్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించాలన్నారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్ మీద ఆధారపడి ఉందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ పాలనతో ఇప్పటికే దేశం కార్పొరేట్ శక్తులకు అప్పగించిందని ఆరోపించారు. పదేళ్లలో 60వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. రూ.55 లక్షల కోట్లు అప్పులు అయ్యాయన్నారు. బీజేపీని ప్రశ్నిస్తే ఈడీ, సీబీఐ పేరుతో జైలులో వేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక ఉండాలంటే సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దోనూరి నర్సిరెడ్డి, నాయకులు అయితగోని విజయ్‌కుమార్, గంగదేవి సైదులు, ఎండీ పాష, బూర్గు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

## కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత

- ఇద్దరి పరిస్థితి విషమం
- భువనగిరి గురుకుల పాఠశాలలో ఘటన

భువనగిరి క్రైం : కలుషిత ఆహారం తిని 25మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన భువనగిరి గురుకుల పాఠశాలలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి పట్టణంలోని సాంఘీక గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు మొత్తం 420 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 11న రాత్రి పాఠశాలలో ఆహారం తిని పడుకున్న విద్యార్థులు తెల వారుజామున వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. అందులో సుమారు 19మందిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా ఆరవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ప్రశాంత్, కళ్యాణ్ కృష్ణల పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని మీరాకల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం పాఠశాల యాజమాన్యం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సమాచారం ఇవ్వడంతో గురుకుల పాఠశాలలో స్పెషల్ క్యాంపు నిర్వహించి చికిత్స అందిస్తున్నారు. శనివారం ఉదయం మరో 8 మంది విద్యార్థులు టి.కార్తిక్, ఎం.శ్రీవాస్తవ్, ఏ.అజయ్, బి.భవిష్య, ఎస్.అజయ్, పి.రిషిత్, ఎం.జశ్వంత్, పి.జశ్వంత్‌లు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు పేర్కొన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు తాము ఎలాంటి ఆహారం అందించలేదని, హాస్టల్‌లో సౌకర్యాలు నామమాత్రమేనని అంటున్నారు. మెరుగైన ఆహారాన్ని అందించకపోవడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**హాస్టల్‌ను సందర్శించిన డీఎంహెచ్ఓ పాపారావు**

హాస్టల్‌లో విద్యార్థుల అస్వస్థతకు గురికాగా ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును డీఎంహెచ్‌లో పాపారావు సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే చికిత్సను అందిస్తున్న వివరాలు సేకరించారు.

**మెరుగైన వైద్యం అందించాలి**

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి

అస్వస్థతకు గురై భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శనివారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థుల పరిస్థితిని విద్యార్థులు వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని సూచించారు.

**జెడ్పీ చైర్మన్ పరామర్శ**

- జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

అస్వస్థతకు గురైన గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే హైదరాబాద్‌లో చికిత్స పొందున్న విద్యార్థుల పరిస్థితిని తెలుసుకున్నారు.

**విద్యాశాఖ అధికారులు బాధ్యత వహించాలి...**

- బీజేపీ నాయకుడు బూర నర్సయ్య గౌడ్

విద్యాశాఖ అధికారులు విద్యార్థుల అస్వస్థతకు పూర్తి బాధ్యత వహించాలని మాజీ ఎంపీ బీజేపీ నాయకులు బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు. భువనగిరిలో విద్యార్థుల ఆత్మహత్యలు, ఇప్పుడు అస్వస్థతలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా మారాయని విమర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

**మౌలిక సదుపాయాలు కల్పించాలి**

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్

ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్ కోరారు. శనివారం గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులను స్థానిక ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు.


వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


విద్యార్థులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి


విద్యార్థిని పరీక్షిస్తున్న బీజేపీ నాయకుడు బూర నర్సయ్య గౌడ్


చికిత్స పొందుతున్న విద్యార్థులు

## మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ


భువనగిరి క్రైం : గుర్తుతెలియని వ్యక్తి మహిళ మెడలో పుస్తెల తాడు అపహరించాడు. ఈ ఘటన భువనగిరి మండలంలోని వీరవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎలకరాజుల శ్రీలత శుక్రవారం రాత్రి ఇంటి ముందు నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి మెడలోని మూడున్నర తులాల పుస్తెలతాడు దొంగిలించుకు వెళ్లాడు. కాగా అదే గ్రామంలో తల్లిగారైన సర్దార్ గోపాల్ ఇంటిలో శుభకార్యానికి వెళ్లి కుటుంబ సభ్యులతో ఇంటి ముందు అరుగు మీద పడుకుని ఉండగా ఈ దొంగతనం జరిగింది. ఈ మేరకు రూరల్ ఎస్‌ఐ సంతోష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ రవి కిరణ్‌రెడ్డి, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ ప్రభాకర్ రెడ్డి, ఎస్ శివనాగ ప్రసాద్‌లు వెళ్లి పరిశీలించారు.


వివరాలు సేకరిస్తున్న పోలీసులు



## పశువుల పెంటతో భూసారం పెంపు

- ఇన్‌చార్జ్ ఏడీఏ కె.సందీప్ సూచనలు




పెద్దవూర: వ్యవసాయంలో రోజురోజుకూ పెరుగుతున్న పెట్టుబడుల నేపథ్యంలో పంట దిగుబడి అధికంగా తీయాలనే ఉద్దేశంతో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రైతులు అధిక శాతం రసాయన ఎరువుల ద్వారానే పంటలను సాగు చేస్తున్నారు. వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నేలలోని పోషకాల నిల్వల్లో సమతుల్యం లోపించి ఉత్పాదక శక్తి తగ్గుతుంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. దీంతో పశువుల ఎరువును పొలాల్లో వేయడం వలన నేలకు సహజసిద్ధంగా బలం చేకూరుతుంది. రైతులకు రసాయన ఎరువుల భారం తగ్గుతుంది. పంట దిగుబడికి దోహదపడుతుంది. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని ఇన్‌చార్జ్ ఏడీఏ కె.సందీప్ సూచిస్తున్నారు.

**నత్రజని, భాస్వరం**

పశువుల పేడను వేసిన తర్వాత భూమిని కలియదున్నితే నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటు సూక్ష్మపోషకాలు తగిన మోతాదులో అందుతాయి. మొక్కకు నీటి లభ్యత ఎల్లప్పుడూ ఉంటుంది.


పెంటను వ్యవసాయ పొలంలో కుప్పలుగా పోసిన రైతులు


పశువుల పెంటను ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు

బాగుండి మంచి దిగుబడి పొందవచ్చు. అలాగే చెరువుల్లో పూడిక తీసిన సమయంలో వచ్చే నల్లమట్టిని వ్యవసాయ భూమిలో పోయించుకుంటే భూసారం పెరుగుతుంది. ఇది నీటిని ఎక్కువగా పీల్చుకుని నేలలో చాలా సమయం వరకు తేమ ఉండేటట్లు చేస్తుంది. దీంతో

**సేంద్రియ ఎరువులతో..**

పశువులు, మేకలు, గొర్రెల పేడ పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇళ్లలో ఏడాది కాలంగా ఉన్న పశువుల పెంట, చెత్త–చెదారం పూర్తిగా కుళ్లిపోతుంది. దీనిని పొల్లాలో వేయడం వలన నేలలో సారం పెరుగుతుంది. దీనిని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతోంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల పేడ ఉపయోగపడుతుంది. ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల పెంటను వినియోగించాలి. పేడను పంట పొలాల్లో వేయడం వలన సహజ సిద్ధమైన లవణాలు పంటకు అందుతాయి.

**భూసారం పదిలం**

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పొలంలో వెదజల్లితే వాటిలోని పోషకాలు ఆవిరి అవుతాయి. పశువుల పెంటను పొలంలో కుప్పలుగా పోసుకోవాలి. భూమిలో తగిన తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీనివలన భూసారం పెరుగుతుంది. భూమి గుల్లబారడానికి తోడ్పడుతుంది. సహజసిద్ధమైన లవణాలు అందుతాయి. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపు చేసి మొక్కలకు అందేవిధంగా సహాయపడతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చును.

**ఇలా దుక్కి దున్నాలి**

దుక్కిని ఎలా పడితే అలా దున్నడం వల్ల సాగు చేసే పంటలకు నష్టం వాటిల్లుతుంది. రైతులు వేసవికాలంలో మెట్ట భూములను వానాకాలం సీజన్ కోసం సన్నద్ధం చేస్తుంటారు. వేసవిలో వచ్చే అధిక వర్షాలకు ఎంతో సారవంతమైన మట్టి నీటి వరదకు వాలు ప్రాంతంలో కొట్టుకుపోతుంది. దీంతో మెట్ట ప్రాంతాలలో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. వాలుకు అడ్డంగా దుక్కి దున్నితే నీటి ప్రవాహం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.